# దారంతెగిన గాలిపటాలు

ఆఫీసరుతో పాటు రామారావు ఉదకమండలం స్టేషన్‌లో దిగినప్పుడు అతని స్మృతిపథంలో మెదలిన మొదటివ్యక్తి—గోపాలం. గోపాలాన్ని మరచిపోవటం అతని వశంకాదు. క్రితంసారి వచ్చినప్పుడు గోపాలం తనకెంత సాయపడ్డాడు! ఐదున్నరకే బెడ్ కాఫీ తెచ్చేవాడు. ఎనిమిదింటికి బ్రేకేఫాస్ట్, పన్నెండున్నరకు లంచ్, నాలుగింటికి కాఫీ, మరల రాత్రికి డిన్నర్...ఇలా తనకోసం శ్రమపడేవాడు. ఖుద్దున ఎన్నోసార్లు పస్తులున్నమాట కూడా వాస్తవం. పైగా బూట్‌పాలిష్ తనే చేసేవాడు. పోస్టాఫీసుకెళ్ళి కవర్లూ—కార్డులూ తెచ్చేవాడు. బజారుకెళ్ళి అవసరమైన సామానులు కొని తెచ్చేవాడు. ఉదయం ఐదున్నరకు ప్రారంభమైన అతనిడ్యూటీ...రాత్రి తొమ్మిదిగంటలకు సమాప్తమయ్యేది...ప్రత్యామ్నాయంగా అతనికి లభించే జీతం నెలకు పదహారురూపాయలు; ఇద్దరు పిల్లలూ, పెళ్ళాం, తనూ జీవించాలి. ఈ పదహారురూపాయల జీతంతో,—ఒకసారి రేషన్‌కు డబ్బులేదని ప్రాధేయపడితే—తను ఐదురూపాయ లిచ్చాడు. పాపం గోపాలం ఆ ఐదురూపాయలు రామారావు వెళ్ళేనాటికి

తీర్చలేకపోయాడు. పరవాలేదన్నాడు రామారావు. అతను పడ్డ శ్రమను డబ్బురూపేణ విలువకట్టడం తెలివితక్కువే అవుతుంది. గోపాలం రామారావుకోసం హృదయపూర్వకంగా శ్రమ పడ్డాడు. దానిముందు డబ్బుకు విలువలేదు. రామారావు రైలెక్కి ఉదకమండలం స్టేషను వీడేప్పుడు గోపాలం అన్నాడు— "బాబుగారూ! మిమ్మల్ని ఎప్పటికీ మరచిపోలేను; వచ్చేయేటికి మరల మీ దర్శనం చేసుకుంటాను" రైలు కదిలిపోయింది.

ఈ సంవత్సరం మరల రైలు ఉదకమండలం స్టేషన్‌లో ఆగినప్పుడు రామారావుకు గోపాలం గుర్తురావటంలో ఆశ్చర్యం లేదు. ఆఫీసరుతోపాటు రామారావు - నిర్ణీతస్థలాని చేరు కున్నాడు.

* * *

రామారావుకు వెనుకటి మాదిరిగానే ఉదయం ఐదున్నరకు బెడ్ కాఫీ వస్తున్నది. ఎనిమిదింటికి బ్రేక్ ఫాస్ట్. పన్నెండున్నరకు లంచ్, నాలుగింటికి కాఫీ, మరల రాత్రికి డిన్నర్ తయార్! బూట్లు దగదగా మెరుస్తున్నాయి. పోస్టాఫీసు పనులు నెరవేరిపోతున్నాయి. బజారునుంచి కావలసిన వస్తువులు కూడా నిమిషాలమీద వస్తున్నాయి. ఉదయం ఐదున్నరకు ప్రారంభమైన అతని డ్యూటీ రాత్రి తొమ్మిదిగంటలకు సమాప్తమవుతున్నది. అయితే ఈ డ్యూటీచేసేది గోపాలం కాదు; వడివేలు. గోపాలం మూడునెలల క్రితం మలేరియా జ్వరంతో బాధపడి మరణించాడు. కష్టాల్ని ఎదుర్కోమని భార్యనూ, ఇద్దరు పిల్లల్నీ ఈ లోకంలో వదిలివెళ్ళాడు. ఈ విషయం మొదటిరోజున వడివేలు

చెప్పినప్పుడు రామారావు ఎంతో బాధపడ్డాడు. ఈసారి వచ్చి నప్పుడు కన్పిస్తానన్నాడు. తను వచ్చాడు, కాని అతడు లేడు. అతని విషాదగాథ మాత్రమే మిగిలి తనకోసం వేచివుంది.

గోపాలం టీ తోటల్లో లోయల ప్రక్కన ప్రాణాల్ని సైతం లెక్కచేయక శ్రమపడ్డాడు. బంగాళాదుంపలు ఎగుమతి చేసే దుకాణంలో చాలాకాలం వళ్ళువంచి పనిచేశాడు. ఆ ఉద్యోగం ఊడినాక...మార్కెట్టుదగ్గర చలిలో, వర్షంలో తట్టపుచ్చుకొని "కూలి కావాలా బాబు!" అంటూ ప్రతి వాళ్ళను దేబరించి కూలిమోసి పొట్టగడుపుకున్నాడు. అదీ పోయాక ఆఖరికి ఎన్నో తంటాలు పడగా ఈ పదహారు రూపా యల ఉద్యోగం దొరికింది. కాని లాభం? సంవత్సరం గడచీ గడవకముందే...మలేరియాకు గురయ్యాడు.

గోపాలం జీవితం సమాప్తం కావటంతో వడివేలు రంగంమీదికి వచ్చాడు. రామారావు వచ్చి పదిహేనురోజులు కావచ్చినా వడివేలును– "ఎవరు నువ్వు? నీకు పెళ్ళయిందా? పిల్లలెంతమంది? పదహారు రూపాయల జీతం నీ జీవనానికి సరి పోతున్నదా?" అని అడగడానికి అతనికి అమిత భయంవేసింది. వడివేలు కూడా గోపాలం మాదిరిగా అనేక కష్టాలుపడి...ఆఖ రికి ఈ పదహారు రూపాయల ఉద్యోగంలోచేరి వుంటాడు. జీతం చాలక ఇతనూ నానాఅగచాట్లు పడుతూవుంటాడు. రామా రావుకు వడివేలును గూర్చి ప్రత్యేకంగా తెలుసుకోవాల్సిన అవసరం కన్పించలేదు. అందుకని మౌనం వహించి వూరు కున్నాడు.

ఒకరోజు సాయంత్రం అయిదుగంటలవేళ వడివేలు రామారావున్న గదిలో ప్రవేశించాడు. చదువుకుంటూన్న అతన్ని భంగపరచటం ఇష్టంలేక వడివేలు స్తంభాని కానుకొని నిల్చున్నాడు. చప్పుడువిని రామారావు తల పైకెత్తాడు. వడివేలు ఎదురుగా కన్పించాడు. ఏవో భావాలు అతని మొహం మీద తొణికిసలాడుతున్నాయి. ఐదురూపాయలు అప్పు తీసుకున్న రోజునకూడా గోపాలం మొహంమీద ఇలాంటి భావాలే కన్పించాయి.

ఏమిటన్నాడు రామారావు "ఒకవిషయం బాబుగారూ!" అన్నాడు వడివేలు. "వడిగా చెప్పు" అన్నాడు రామారావు. ఆమాట అన్నాడేగాని, అప్పటికి రామారావు మనస్సులో వడివేలును గురించిన అనేక భావాలు ఒకదాని తరువాత ఒకటి పొరలు పొరలుగా లేస్తున్నాయి ... బహుశా వడివేలుకు రేషన్‌కు డబ్బులేదేమో?...అతనిభార్య ప్రసవించే రోజులేమో? పిల్లలకు జబ్బుచేసిందేమో? లేక తనే అనారోగ్యంగా వున్నాడేమో? (మనిషి చూట్టానికి అలాగే కన్పిస్తారు గనుక) లేదా ఈ జీతం చాలడంలేదని పై అధికారులకు సిఫారసు చేయమంటాడేమో?

వడివేలు తన అధరాలమీద చిరునవ్వును చిలికించుకుంటూ అసలు విషయం చెప్పినప్పుడు-రామారావు మనస్సు చుట్టూరా ఏర్పడిన భావనలు ఒక్కసారిగా చెల్లాచెదరయి నాయి.

"బాబుగారూ! గోపాలం చెప్పాడు- మీరు కథలురాసి పత్రికలకు పంపిస్తూ వుంటారట. దయచేసి నా మీదకూడ ఒక కథరాసి ఏ పత్రికకయినా పంపించండి. మీ మేలు మరచిపోను." ఇదీ వడివేలు వేడికోలు.

వడివేలు విన్నపానికి రామారావుకు నవ్వొచ్చింది. అతనిమీద ఎలా కథ రాసేది? పాతిక సంవత్సరాల వయస్సులో జమానులాగా వుండాల్సినవాడు నలభై సంవత్సరాల మనిషిలాగా కన్పిస్తున్నాడు. కళ్లు పీక్కుపోయాయి. బుగ్గలు అప్పచ్చులు లాగా వున్నాయి. సన్నగా గాలికి కొట్టుకుపోయే వాడిలా వున్నాడు. ఎముకలు బయటికి పొడుచుకొచ్చాయి. ఊచల్లాంటి రాళ్ళచేతులమధ్య...అస్థిపంజరం నిలబెట్టినట్లున్నది. అతని ఆకా కాలు పైగా అతను సంపాదించేది నెలకు పదహారురూపాయలు. ఇలాంటి వాడిమీద కథ ఎలా రాయటం? పైగా ఉదకమండలం కొండలమీద వుంటూ.

ఎండలకు తట్టుకోలేక...చల్లదనంకోసం ఇక్కడికి పరుగెత్తుకొచ్చిన సేవకుల్నిగూర్చి, మినిస్టర్లనుగూర్చి, రాజాలను గూర్చి, రాజప్రముఖుల్నిగూర్చి. వాళ్ళకు సంబంధించిన ఆడ వాళ్ళనుగూర్చి, వాళ్ళ కుక్కల్నిగూర్చి, వాళ్ళ ఫేషన్సుగూర్చి, వీళ్లు పాల్గొనే గుర్రపుపందాలను గూర్చి, విందులు వినోదాల్ని గూర్చి ఎంతయినా రాయచ్చు, ఎందుకంటే ప్రస్తుతం ఉదక మండలం కాను వీళ్ళతో నిండివుంది, హోటల్ డొమీని యన్, హోటల్ డీలక్స్, హోటల్ వీనస్, దశక ప్రకాశ్, మోడరన్‌లాడ్జి. ఊటీ కేఫ్ - మొదలైనచోట్లు క్రిక్కిరిసి వున్నాయి. కేవల్‌రామ్స్, చాందీరామ్స్, చెల్లారామ్స్, సేవా

రామ్స్- మొదలైన పెద్దపెద్ద బట్టలదుకాణాల ఎదుట - ఉన్ని గుడ్డలుకొనే పనిమీద వచ్చిన గొప్పవాళ్ళకార్లు సందులేకుండా వున్నాయి. సాయంత్రం కావటంతోటే-"గవర్నమెంట్ బొటానికల్ గార్డెన్స్"లో చెట్టపట్టాల్ వేసుకొని...చెట్లక్రింద రక రకాల విలువగల దుస్తుల్లో కన్పించే వ్యక్తులు కూడా వీళ్ళే! "డాగ్ షో"లోనూ, "ఫ్లవర్ షో"లోనూ వీళ్ళే-దొంగ వ్యాపారంలో సంపాదించిన డబ్బూ, ప్రజల పేరుమీదుగా సంపాదించిన ధనాన్నీ, బ్రిటిష్‌రాజుల కాలంలో సంక్రమించిన ఐశ్వర్యాన్నీ ఈ రకంగా తమ సుఖంకోసం, తమ స్వార్థంకోసం వినియోగించుకుంటూ-కన్పిస్తారు. ఆనందంకోసం డబ్బు మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చుపెడుతున్నారే.

వీళ్ళంతా ఇక్కడ జరిగే ప్రతి సభా సమావేశంలోనూ పాల్గొంటారు, దేశాన్నిగూర్చి, ప్రజల్నిగూర్చి మాట్లాడతారు. ఇక్కడ పాల్గొనేవాళ్లు సామాన్యులుకారు. ఇంగ్లీషు స్టైయిల్‌లో వున్న ఆడవాళ్ళూ, అమెరికను ఫేషనులోవున్న మగవాళ్ళూ... టీ ఎస్టేటుల యజమానులూ...పెద్దపెద్ద సేఠ్‌లూనూ, వీళ్లు జరిపిన సమావేశాల వివరం రెండోరోజు పత్రికల్లో-తాటికాయంత అక్షరాల్లో వస్తుంది. జనం విరగబడి చదువుతారు. దేశాన్ని గూర్చి, ప్రజల్నిగూర్చి ఆ సమావేశంలో వెలువరించబడిన భావాల్నీ, ఆ భావాలు వెల్లడించిన వ్యక్తుల్నీ జనం పొగుడుతారు. అంతేగాని అనాకారి వడివేలుమీద కథరాస్తే పత్రికలెలా వేసుకుంటాయి? అథవా వేసుకున్నా చదివేవాళ్ళకు మటుకు అతని కథమీద ఆసక్తి ఏమివుంటుంది.

రామారావు ఆలోచనలకు అంతుదొరకలేదు. వడివేలు ఇంకా అలాగే నిలబడి రామారావు జవాబుకోసం చూస్తున్నాడు. రామారావు తలొంచుకొని ఆలోచిస్తున్నాడు. వడివేలు కథ ఎలాగా రాయటమని.

*　　　　*　　　　*

రామారావు కథ రాయటానికిగాను వడివేలును అనేక ప్రశ్నలు వేశాడు. అతను సమాధానం చెప్పాడు. అవన్నీ విన్నాక అంతటి నీరసజీవితాన్ని ఎలా చిత్రించటం? అని రామారావు బాధపడ్డాడు.

ఆ రాత్రల్లా రామారావు ఆలోచించాడు. ఏమీ పాలుపోలేదు. వడివేలు కథ రాయాలనుకున్నప్పుడెల్లా గోపాలం గుర్తొచ్చాడు. ఐదురూపాయలు అప్పుగా తీసుకున్నరోజు కళ్ళకు కట్టినట్లు కన్పించేది...రైలు కదలబోయేప్పుడు "బాబుగారూ! మిమ్మల్ని ఎప్పటికీ మరచిపోలేను. వచ్చేపటికి మరల మీ దర్శనం చేసుకుంటాను" అన్నమాటలు రామారావు స్మృతిపథంలో పచుచుకుపోయేవి. మరో నిమిషంలో రామారావుకు చనిపోయిన గోపాలం బ్రతికినట్లూ, బ్రతికివున్న వడివేలు చనిపోయినట్లు అనిపించేది. మరల కాసేపట్లోనే చచ్చిపోయిన వడివేలు బ్రతికి వున్నట్లూ, బ్రతికివున్న గోపాలం చచ్చిపోయినట్లూ అనిపించింది.

ఆ రెండోరోజు సాయంకాలం ఆరుగంటలవేళ...రామారావు "గవర్నమెంట్ బొటానికల్ గార్డెన్" లో ప్రవేశించి

నప్పుడు ... అక్కడ కన్పించిన మనుష్యుల్లో ఎవరూ వడివేలు లాగా కన్పించలేదు. అంతా ఉలెన్ సూట్లలోనూ, సిల్కు చీరెల్లోను వున్నారు. వాళ్ళ పిల్లలు కేరింతలు కొడుతున్నారు. “బొటానికల్ గార్డెన్‌లో” అందంగా అమర్చిన ఇంగ్లీషు పూల చెట్ల పొదల ప్రక్కగా, విరియబూచిన దేశీయ గులాబీచెట్ల చెంతనే వాళ్లు నడుస్తుంటే చూట్టానికి అతి మనోజ్ఞంగా కన్పిస్తున్నది. కాని అలాంటి మనోజ్ఞత వడివేలు జీవితంలో లేదు.

వడివేలు జీతం పదహారు రూపాయలు. దీంతోనే ... జవసత్వాలుడిగిపోయిన తలిదండ్రుల్ని పోషించాలి. ఈ జీతం ముగ్గురూ రోజూ మూడుపూట్లా తిండితింటూ గడిపితే — వారం రోజులకు కూడా సరిపోదు. అందుకని వడివేలు ముసలి తండ్రి ఉదయమే లేచి ... అడుక్కోటానికి బయలుదేర్తాడు. ఏదో కొంత లభిస్తుంది. పన్నెండుగంటలకు ముగ్గురూ ... ఏదో తిని పొట్టనింపుకుంటారు. మరల రాత్రికి కేవలం గంజి త్రాగి గడుపుతారు. రోజులిలా గడుస్తున్నాయి. అలాంటి జీవితానికి విలువ ఎలా కట్టేది?

రామారావు ఒక బెంచీమీద కూలబడి నలువేపులా పరికించాడు. సేఠ్‌జీ కారుదిగి షికారుకు బయలుదేరాడు. ఎంత ఠీవిగా నడుస్తున్నాడు? ఎంత హుందాతనం వుంది మనిషిలో? ఈసుఖం అతనికెలా సంక్రమించింది? వడివేలు గుర్తుకొచ్చాడు. కాని లాభం? సేఠ్‌జీ పుచ్చుకొన్న పొన్నుకర్ర ఖరీదు చేయడు వాడు. —

మరోవేపు చూచాడు — నలుగు రాడవాళ్ళు — ఇంగ్లీషు ఫేషన్‌కు నమూనాలు — చేతిసంచుల్ని వయ్యారంగా కదుపుకుంటూ పచ్చటి గడ్డిమీద తమ రంగురంగు మడమల బూట్లను అందంగా ఆనించుకుంటూ — నవ్వుకుంటూ నడుస్తున్నారు. వడివేలు విలువ వాళ్ళ పెదాలమీద పులుముకున్న అర్డినా లిప్‌స్టిక్ మాత్రం కూడా చేయదు.

ఎవరో తెల్లటి బట్ట వేసుకోని — సమానంగా కత్తిరించబడి, అతి అందంగా కన్పించే పచ్చటి పొదలవెంట — ఎవరితోనో రాజకీయాలు మాట్లాడుతూ నడుస్తూంటే ఎంతో కన్నులపండువుగా వుంది. వాతావరణ మార్పుకోసం ఇక్కడికొచ్చారు. కాని విచిత్రమేమిటంటే ... ఈయనగారు వడివేలు లాంటి అభాగ్యవ్యక్తుల సుఖంకోసం రవ్వంతయినా ప్రయత్నం చేయలేదు.

“బొటానికల్ గార్డెన్” రంగురంగుల పూలతో, అందంగా కత్తిరించబడిన పచ్చటి పొదలతో, విలువగల దుస్తులు ధరించిన ధనికవర్గంతో కళకళలాడుతున్నది. వడివేలు జీవితం ఈ వాతావరణం ముందు వెలవెల పోతున్నది. ఇలాంటి స్థితిలో అతని కథ ఎలా తయారవుతుంది? తన మనోనేత్రం ఎదుట “బాబుగారూ! నా మీదకూడా ఒక కథరాసి ఏ పత్రికకయినా పంపించండి.” అని వేడుకున్న వడివేలు దీనవదనం రామారావుకు కన్పించింది. రామారావు అనుకున్నాడు — ఎండి మోడయిపోయిన నీ జీవితాన్ని గూర్చి ఎలా రాయటం? నీకు పెళ్ళి కాలేదు. పెళ్ళి ఎందుకు చేసుకోలేదో అడిగిమాత్రం లాభం? నీ జీవితానికి సుఖంలేదు. నీలోని కోర్కెలు ... లోపల

లోపలే ... కుంచుకుపోయాయి. నీ తలిదండ్రులు కొనవూపిరితో జీవించివున్నారు. మీరంతా రోజుకు ఒక్కపూటమాత్రమే పొట్టనింపుకొని బతుకుతున్నారు. మీ జీవితాలు దారంతెగిన గాలిపటాలు. మీ బతుకుల్లో సారంలేదు. మీ చేతుల్లో సత్తువలేదు. నిత్యం మీలో ఆకలి కణకణ మండుతూవుంటుంది. ఉదకమండలం చలికి మీరు గడగడ వణుకుతున్నారు. మీ చుట్టూ అంధకారం అలుముకొనివుంది. మీరు ధరించిన గుడ్డలనుంచి చెడువాసన కొడుతోంది. అందుకే మీలాంటి వాళ్ళకు "బొటానికల్ గార్డెన్"లో స్థానంలేదు. మీవల్ల ఇక్కడి వాతావరణం కలుషితమైపోతుంది.

ఏడు గంటలు కావచ్చింది. అంతా వెళ్ళిపోయారు. రామారావు వొక్కడే అక్కడ మిగిలిఉన్నాడు. ఇంకోగంటలో వడివేలు అడుగుతాడు — "నామీద కథ రాశారా బాబుగారూ!" అని. అతనికేం సమాధానం చెప్పాలి. గోపాలం బాధలతో, జబ్బులతో కృంగి కృశించి మరణించాడు. వడివేలు జీవితానికిమాత్రం గ్యారంటీ ఏముంది? కాని "నువ్వుకూడా ఏదో ఒకరోజు చచ్చిపోతావు. మరల నీకు బదులుగా మరో వ్యక్తి ఈ పదహారు రూపాయల ఉద్యోగాన్ని స్వీకరిస్తాడు. ఈ రకంగా మీ జీవితాలు ... కాలగర్భంలో కలసిపోతాయి." — అని రామారావు వడివేలుతో చెప్పదలచలేదు. తనకు చేతనయితే — అతనిముందు విచ్చులుకున్న అంధకారాన్ని తీసేసి వెలుగుబాటకు దారి చూపించాలి.

రామారావు ఆరోజు రాత్రల్లా ఏవేవో చాలా ఆలోచించాడు — వడివేలును గురించి. ఆఖరికి ... ఉదయం ఐదు

న్నరకు అతను బెడ్ కాఫీ తెచ్చినప్పుడు —- ఈ విధంగా చెప్పాలని తీర్మానించుకున్నాడు :— “ నీ జీవితానికి ఒక సమగ్ర రూపం ఏర్పరచేందుకూ, నీ దుఃఖగాథకు నాందిగేయం పాట్టానికి, నీ కనుకొలకుల నీటిని తీసేసేందుకూ, నీ విషాదాన్ని లిపిబద్ధంచేసి కథగా రాయటానికి నేనొక్కణ్ణీ అశక్తుణ్ణి. నాతో ఇంకా నలుగురు కలిస్తే నీ సుఖంకోసం నా శాయశక్తులా యత్నంచేస్తాను. అప్పుడు నీ కథకు పరిపూర్ణత ఏర్పడగలదు. ప్రస్తుతానికి క్షమించాలి”—

తీరా తెల్లవారాక ... రామారావు బెడ్ కాఫీఅందించేందుకు వచ్చిన వడివేలుతో సరీగ్గా ఈ మాటలే చెబుతాడో లేక...“నీ కథ తయారవుతున్నది—దానికి నువ్వే కథానాయకుడివి ... ఈ విశ్వం నీది—దీనికి అధిపతివి నువ్వే! నీ చుట్టూ శాంతి సౌఖ్యాలు విరజిమ్ముకుంటాయి! నీ జీవచ్ఛవం నవజీవనం పోసుకుంటుంది—” అని చెబుతాడో?